క్లుప్తంగా

పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్

తిరుమలాయపాలెం: ప్రగతి శీల యువజన సమాఖ్య(పీవైఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గొర్రె పాటి రమేష్ ఎన్నికయ్యారు. ఇల్లెందులో జరిగిన రాష్ట్ర మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా ఉన్న రమేష్ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు.... సంఘం బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువతను ఏకం చేసి ఐక్య పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ అందజేశారు. కందాళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మంగాపురంతండా, పైనంపల్లి, నాచేపల్లి, కొత్తూరు, తిరుమలాపురం, రామచంద్రాపురంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శాంత, ఎంపీపీ వజ్జా రమ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ జంతు సంక్రమిత వ్యాధుల దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి జగ్గులాల్ హాజరై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏ.సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఖమ్మం నగరంతో పాటు, చింతకాని, రఘునాథపాలెం మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం పాఠశాలలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు, సిబ్బంది లేరని, వెంటనే సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వరుణ్, హరికృష్ణ, నరేందర్, ప్రణయ్, ప్రవీణ్, నాగరాజు, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

అన్నీ తానై..



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం రైలు నుండి జారిపడి మృతిచెందిన మహారాష్ట్ర వాసి అలెక్స్‌కు అన్నీతానై అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు అంత్యక్రియలు నిర్వహించారు. అలెక్స్ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి తన తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఫౌండేషన్, జీఆర్పీ పోలీసుల ఆధ్వర్యంలో వారి ఆచారం ప్రకారం అంత్యక్రియలు జరిపించారు. దీంతో అలెక్స్ కుటుంబసభ్యులు, జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు శ్రీనివాసరావుకు అభినందనలు తెలియచేశారు.

రైల్వే కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న 20 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నాలుగునెలలు వేతనాలతోపాటు పీఎఫ్ కట్టకుండా ఇబ్బందిపెడుతున్న రైల్వే క్లీనింగ్ కాంట్రాక్టర్ అహ్మద్‌పై చర్యతీసుకోవాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం హెచ్ఐకి వినతి పత్రం అందజేసింది. ఈసందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి అశోక్ మాట్లాడగా రంగయ్య, జ్యోతి, రేణుక, చంద్రకళ, ధనమ్మ, వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, చిన్న పాల్గొన్నారు.

‘ఫ్రీడం’ ఫ్లాప్..!

పార్కు పనుల్లో లోపించిన నాణ్యత

- ఓపెన్ జిమ్‌లో ఊడిపోతున్న పరికరాలు
- ప్రారంభించకుండానే మరమ్మతులకు గురవుతున్న వైనం
- కమీషన్లు తీసుకొని బిల్లుల చెల్లింపు
- పర్యవేక్షించని ఇంజనీరింగ్ అధికారులు



51వ డివిజన్‌లోని ఫ్రీడం పార్క్



సిమెంట్ పనులు సక్రమంగా చేయకపోవడంతో పునాదిలో తేలిన కాంక్రీట్



ఒరిగిన క్రాస్ వాకర్ పరికరం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్‌లో ఫ్రీడం పార్క్‌ను ఏర్పాటు చేసి స్థానిక ప్రజల సౌకర్యార్థం అందులో సుమారు రూ.11 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌ను మంజూరు చేశారు. ఓ కాంట్రాక్టర్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు టెండర్ దక్కించుకుని పనులను టెండర్ దక్కిన చాలా రోజుల తర్వాత ప్రారంభించాడు. మెటీరియల్ తెప్పించి, పక్కన పెట్టి నెలలు గడిచినా ఏర్పాటు చేయలేదు. స్థానికుల ఒత్తిడితో అధికారులు సదరు కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించి, వారం రోజుల్లోనే సిమెంట్ పనులు పూర్తి చేసి జిమ్ పరికరాలను ఏర్పాటు చేశాడు. ఇంత వరకు బాగున్నా.. అవి ఏర్పాటు చేసిన పది రోజుల్లోనే బేస్‌మెంట్ నుండి జిమ్ పరికరాలు ఒరిగిపోయాయి. వీటిని చూసిన స్థానిక ప్రజలు ఇదేమి పనులంటూ చీదరించుకుంటున్నారు. నాణ్యత లేని పనులను ప్రారంభించి ప్రజలకు అప్పగిస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నగరంలోని ప్రతీ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్‌లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, వాక్‌వేలు నిర్మిస్తున్నారు. అయితే కొంత మంది కాంట్రాక్టర్లు ఇదే అదునుగా కేఎంసీ నుండి పనులు చేసేందుకు టెండర్లు దక్కించుకుని తూతూ మంత్రంగా పనులు పూర్తి చేస్తున్నారు. ఇక అధికారులు సైతం పర్యవేక్షించకుండానే కాంట్రాక్టర్ల బిల్లులపై సంతకాలు చేస్తున్నారు.

కమీషన్లు ఇస్తే చాలు..

పనులు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సకాలంలో నాణ్యత లోపించకుండా పూర్తి చేయించాల్సిన బాధ్యత కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులపై ఉంది. అయితే అధికారులు పనుల పర్యవేక్షణను గాలికొదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ పక్క మంత్రి, మేయర్, ఇతర ప్రజాప్రతినిధులు పనులను పరిశీలిస్తూ, నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశిస్తున్నారు. అయితే అధికారులు మాత్రం కాంట్రాక్టర్ల నుంచి వచ్చే కమీషన్లను తీసుకొని వారు చేపట్టిన పనులను పర్యవేక్షించడమే మానేశారు. దీతో కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను లోపభూయిష్టంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పట్టించుకోకపోతే అంతే..

ఇటీవల కాలంలో కేఎంసీలో జరుగుతున్న పనులపై ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు తమకు నచ్చిన వారికే పనులు కట్టబెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అత్యవసర పనులు పేరుతో తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లతో పనులు చేయించి, ఆ తర్వాత అదే పనులకు టెండర్ల ప్రక్రియ చేపట్టి, పనులు చేసిన కాంట్రాక్టర్‌కే దక్కేలా చక్రం తిప్పుతున్నారు. ఇక చేసిన పనులకు కమీషన్లు తీసుకుని బిల్లులపై సంతకాలు చేయించుకుంటున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతుంది. ఓ అధికారిణి ఇంటి వద్దనే డబ్బులు తీసుకొని పనులు సక్రమంగా చేసినా.. చేయకున్నా సంతకాలు పెట్టి చేతులు దులుకుంటుందన్న చర్చ బహిరంగంగానే జరుగుతుంది. నాణ్యత లేకుండా పనులు పూర్తి చేయడాన్ని పాలకులు పట్టించుకోకపోతే పనులన్నీ నాసిరకంగానే పూర్తి చేస్తారన్న విమర్శలు ఉన్నాయి.

పనులు ప్రారంభించాకనే బిల్లులు

కేఎంసీలో కాంట్రాక్టర్లు చేసే పనులను ప్రారంభించిన తర్వాతనే బిల్లులు చేస్తాం. పూర్తయిన పనులను పరిశీలించి, నాణ్యత ఉంటేనే బిల్లులపై సంతకాలు చేస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపించినట్లు గుర్తిస్తే సదరు కాంట్రాక్టర్‌తో ఆ పనిని మళ్లీ చేయిస్తాం.

– కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ

ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులకు సన్మానం



ప్రశంసా పత్రాలతో అధికారులు, ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కళాభవన్‌లో ప్రగతి రథచక్రం వార్షిక పురస్కారాలు పేరటి జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఖమ్మం రీజియన్‌లో నగదు పురస్కారాలు పొందిన అధికారులకు, ఉద్యోగులకు గురువారం నూతన బస్టాండ్‌లో డిప్యూటీ ఆర్ఎం బి.ప్రసాద్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ సేవలను మెరుగుపరిచి ఖమ్మం రీజియన్‌కు మంచిపేరు తేవాలని కోరారు. దసరా ఛాలెంజ్ అవార్డు గ్రహీతలు జీ.రవీందర్, ప్రకాశరావు, ఎండి జీ.పాషా, పీఎస్ నారాయణ, కేవీలు, ఎస్‌డీ.సయ్యద్ అలీ, పీజేరావ్ టి.నాగేశ్వరరావు, కేపీరావ్, షేక్ నాగుర్‌వలీ, జి.లింగమూర్తి, రమాదేవిలు పీఎస్ నారాయణ, అలాగే సంక్రాంతి ఛాలెంజ్ అవార్డు గ్రహీతలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఓ రామ్మోహన్, అకౌంట్స్ ఆఫీసర్ బాలస్వామి, డీఎంలు శ్రీనివాస్, స్వామి, దేవదానం, రాజ్యలక్ష్మి, రామారావు, వెంకటేశ్వర్లు, ఖమ్మం సీఐ రామయ్య ఇతర డిపోల సిఐలు పాల్గొన్నారు.

హుండీ వితరణ

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయానికి ఆలయ కమిటీ చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి కుటుంబసభ్యులు రూ.28 వేలతో తయారు చేయించిన హుండీని వితరణ చేశారు. గురువారం ఈ హుండీని ఆలయానికి అందజేశారు. పాత హుండీని లెక్కించగా రూ.15 వేల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీకాంత్ తెలిపారు. అర్చకులు శేషగిరి శర్మ, డైరెక్టర్లు సునీత, రామకృష్ణ, నాగయ్య, ముత్తయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

నేలకొండపల్లి: తెలంగాణ క్రీడా పాఠశాల ప్రవేశాల ఎంపికకు గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. 4, 5వ తరగతుల్లో ప్రవేశానికి మండలంలోని 13 పాఠశాలల నుంచి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా జిల్లా స్థాయికి మొత్తం ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 9 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపికలో పోటీ పడాల్సి ఉంటుంది. మండలస్థాయిలో ఎంపికలను విజయవంతం చేసేందుకు హెచ్ఎం లక్ష్మి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీడీ వి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

ఖమ్మం మామిళ్లగూడెం: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ కె.రమేష్ మాట్లాడుతూ... ఈనెల 8న హన్మకొండలో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్రప్రదీప్, శ్యామ్ రాథోడ్, నున్న రవికుమార్, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, చంద్రశేఖర్, గుత్తా వెంకటేశ్వర్లు , వీరవల్లి రాజేష్, అల్లిక అంజయ్య, రామలింగేశ్వరరావు, డీకొండశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. వాడవాడన పువ్వాడ కార్యక్రమంలో భాగంగా 29, 30 డివిజన్లలో, పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. వీడీవోస్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎస్సై సెయింట్ మేరిస్ కమ్యూనిటీ హాల్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

ఐఎంఏకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: నగరంలో పని చేస్తున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజు రాయితీ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)అధ్యక్షుడు డాక్టర్ భాగం కిషన్‌రావుకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ గురువారం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఐజేయూ నాయకులు మాట్లాడుతూ.. కన్సల్టెంట్ ఫీజు లేకుండా, వివిధ చికిత్సలకు సంబంధించి టెస్టులు తదితరాల్లో 50 శాతం రాయితీ కల్పించాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన భాగం కిషన్‌రావు ఐఎంఏ జనరల్ బాడీలో ఎజెండా చేర్చి జర్నలిస్టులకు సహకరించేలా చూస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, మాధవరావు, చెరుకుపల్లి శ్రీనివాసరావు, పురుషోత్తం, కల్యాణ్, మేడి రమేష్, అశోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పురోహితుల క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు జరిగిన మొదటి మ్యాచ్‌ల్లో కురవి–నర్సీపట్నం జట్లు తలపడగా కురవి జట్టు గెలవగా, తర్వాత జరిగిన మ్యాచ్‌లో భీమవరం–మోపిదేవి జట్లు తలపడగా మోపిదేవి విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో నూజివీడు– గుడివాడ జట్లు తలపడగా నూజివీడు గెలుపొందింది. తర్వాత జరిగిన మ్యాచ్‌లో భీమవరం – విజయవాడ జట్లు తలపడగా విజయవాడ జట్టు గెలుపొందింది. చివరిగా మోపిదేవి–కొవ్వూరు జట్ల మధ్య మ్యాచ్‌లో మోపిదేవి విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

10న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: రోజు కూలీ రూ.600 ఇవ్వాలని, గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర ధరలు పెరిగాయని, వచ్చే కూలీ వేతనం కూలీలకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. పోడు సాగుదారులందరికీ పోడు పట్టాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వ లేదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, శ్రీనివాసరావు, వత్సవాయి జానికి రాములు, నాగేశ్వరరావు, కెవి రెడ్డి, సంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు గురువారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం రూరల్: సమ్మె చేస్తున్న కార్మికులు



కూసుమంచిలో..



రఘునాథపాలెంలో..



నేలకొండపల్లిలో..

25 ఏళ్లకు సరిపడా అభివృద్ధి..

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఖమ్మంమయూరిసెంటర్: సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో 25 ఏళ్లకు సరిపడే అభివృద్ధి కేవలం గడిచిన ఐదేళ్లలో పూర్తి చేశామని, అది తెలంగాణ ప్రభుత్వం వల్లే సాధ్యం అయిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రూ.1.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేశారు. 4వ డివిజన్ పాండురంగాపురంలో డ్రెయినేజీల పనులకు, 45వ డివిజన్ మామిళ్లగూడెంలో, 50వ డివిజన్ బైపాస్ రోడ్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను, 53వ డివిజన్ గట్టయ్యా సెంటర్ వద్ద బోడేపూడి స్తూపం దగ్గర సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరాభివృద్ధిలో భాగంగా కోట్ల రూపాయలు వెచ్చించి ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. నగరంలోని పలు డివిజన్లలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.90 లక్షలు, సుడా నిధులు రూ.60 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి..

భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నగరం తెలంగాణ తల్లి సర్కిల్ నందు గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చెర్మన్ విజయ్ కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు దండా జ్యోతి రెడ్డి, బుడిగెం శ్రీను, రాపర్తి శరత్, పగడాల శ్రీవిద్య నాగరాజు, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈలు రంగారావు, స్వరూపరాణి, జ్యోతి, కొల్లు పద్మ, కంచర్ల దయాకర్, అరెంపుల వీరభద్రం, భాస్కర్, ఏడెల్లి భిక్షం, షకీన, నారమళ్ల వెంకన్న, షంషుద్దిన్, తన్నీరు శోభారాణి, యేచ్చు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత..

రఘునాథపాలెం: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చిమ్మపుడి గ్రామానికి చెందిన విద్యార్థిని అల్లు సుష్మిత రెడ్డి వెన్నుపూస ఆపరేషన్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1 లక్షా 25 వేల ఎల్ఓసీని గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విద్యార్థినికి తల్లిదండ్రులకు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి వైస్‌ఎంపీపీ గుత్తా రవికుమార్ చొరవతో మంత్రి పువ్వాడ సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరీ చేయించినట్లు తెలిపారు.

విశ్వాసంతో పనిచేస్తే ఉన్నత స్థానాలకు..



చందు, వరలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: విధి నిర్వహణలో విశ్వాసం, నమ్మకంతో పని చేస్తే ఆ సంస్థల తోపాటు ఆ వ్యక్తులు ఉన్నత స్థానాల్లో ఉంటారని ఖమ్మం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏడునూతల శ్రీనివాసరావు, మండడపు శ్రీనివాసరావు అన్నారు. ఏడునూతల శ్రీనివాసరావు న్యాయవాది కార్యాలయంలో న్యాయవాది గుమస్తాగా పెరుమాళ్ల చందు 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం చందు, వరలక్ష్మి దంపతులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏడునూతల అనురాధ,యడ్లపల్లి రమేష్, పాడిబండ్ల సంజయ్ కుమార్, పబ్బతి రామబ్రహ్మం, బి.అశోక్, పలివెల శ్రీలక్ష్మి, యాసా లత, వావిలాల ఆశ, బంధం హారిక, హాఫిజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మం సహకారనగర్: వైరా మండలంలోని కొష్టాలకు చెందిన పిల్లి అఖిల్ శైలింగ్ జూనియర్ ఒలంపిక్స్‌కు ఎంపిక కాగా జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ సూచనలతో ఎలగొండ స్వామి 25 వేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ మేరకు గురువారం అఖిల్ తండ్రికి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ చాంబర్‌లో నగదు అందించారు.

ఆలయాల్లో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ సెంటర్‌లోని బాలగణపతి ఆలయంలో గురువారం రాత్రి వందలాదిమంది భక్త జన సమక్షంలో సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావుల ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

సాయిబాబా మందిరంలో..

నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు బాబాను దర్శించుకుని హారతి పూజలు చేశారు. ఈసందర్భంగా దేవాలయ కమిటీ వారి ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

ఉపేంద్రాచారికి నివాళి



ఉపేంద్రాచారి (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు, సాంస్కృతిక బాషల్లో పండితుడు, వాస్తు, జ్యోతిష్య విభాగల్లో నిష్ణాతులు బ్రహ్మశ్రీ కల్లూరి ఉపేంద్రాచారి (80) గురువారం అనారోగ్యంతో మృతిచెందగా పలువురు నివాళులర్పించారు. సుమారు 45 ఏళ్ల పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉపేంద్రచారి ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేశారు. నివాళులర్పించిన వారిలో జ్యోతిష్య శాస్త్ర నిపుణులు రిటైర్డ్ సబ్ రిజిస్టార్ తంగిరాల దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, ఖమ్మం టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, డీసీసీబీ రిటైర్డ్ కకారి నాగాచారి, ఉన్నారు.

టీపీసీసీ సమావేశానికి జిల్లా నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏఐసీసీ, టీపీసీసీ అగ్రనేతలు పాల్గొని పలు సూచనలు చేసినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. వడ్డె నారాయణరావు, మద్దినేని రమేష్, బెల్లం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నాయకులను అభినందించిన రేవంత్‌రెడ్డి

ఖమ్మంరూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గురువారం మండల కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జనగర్జన సభను విజయవంతం చేసినందున పార్టీ మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, సర్పంచ్ కేతినేని వేణు, నాయకులు ధరావత్ ఆనంద్‌ను అభినందించారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

తిరుమలాయపాలెం: వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా ప్రజలకు విష జ్వరాలు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఝాన్సీలక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలోని పిండిప్రోలులో సంఘం సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో పాలేరు డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి సరోజిని, బందెల లలిత, పసుమతి, తోట సరోజిని, కలపాల జయమ్మ, సరిత పాల్గొన్నారు.

వెంచర్లపై చర్య తీసుకోవాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో చెరువు లోతట్టు ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్ గురువారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ వెంచర్లను ఆపడంతోపాటు, 1,600 గజాల గ్రీన్‌బెల్ట్ స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నా. వీధులను స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వాస్పత్రి స్థలాన్ని ఇతర పనులకు వినియోగించకుండా కాపాడాలన్నారు.

ఈసీ మీటింగ్‌లో సునీతరావు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర ఈసీ మీటింగ్‌లో సంఘం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని మాట్లాడారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించినట్లు ఆమె తెలిపారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి

ఖమ్మం మామిళ్లగూడెం: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా దళితరత్న అవార్డు గ్రహీత, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ తల్లి సర్కిల్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, వెంకయ్య, బంకా వెంకన్న, సతీష్, నాగయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలకేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎస్సై రమేష్‌కుమార్, బహుజన నాయకులు కొమ్ము ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, శంకర్, సుధాకర్, వెంకన్న శ్రీను, వీరు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్



కూసుమంచిలో..